క్లుప్తంగా

నిధులు మంజూరు చేయండి

నారాయణఖేడ్: ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్ డిమాండ్‌చేశారు. ఉపాధిహామీలో భాగంగా చేపట్టిన వివిధ పనులకు సంబంధించి మెటీరియల్ కాంపొనెంట్ కింద చెల్లించాల్సిన నిధులను ఇప్పటివరకూ చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికై నా కేంద్ర ప్రభుత్వం స్పందించి నిధులను మంజూరు చేయాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మెప్మా ఆర్పీలు

జహీరాబాద్: వేతనాలను పెంచినందుకుగాను మెప్మా ఆర్పీలు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 2007 నుంచి పనిచేస్తున్న మెప్మా ఆర్పీలను ప్రభుత్వం గుర్తించి 2019లో రూ.4వేల వేతనం ఇచ్చిందన్నారు. తమ పనితనాన్ని గుర్తించి ప్రభుత్వం మరో రూ.2వేల వేతనం పెంచిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్పీలు శారద, అన్నపూర్ణ, స్వరూప, సావిత్రి, శంకర్‌రెడ్డి, ప్రేమలమ్మ, లక్ష్మీ, మహాదేవి, గౌసియా పాల్గొన్నారు.

'జీవోలు చూపితే ప్రజలు నమ్మరు'



మాట్లాడుతున్న ప్రకాష్‌రాథోడ్

నారాయణఖేడ్: గిరిజన తండాల అభివృద్ధికి సంబంధించి ఎన్నికలకు ముందు జీవో కాపీలను చూపితే ప్రజలు నమ్మరని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్ అన్నారు. ఖేడ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులకు తండాల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. తండాలకు రోడ్లు వేయించని పక్షంలో ఆ పార్టీ వారిని తండాలకు రానివ్వబోమన్నారు. ఇప్పటివరకు తండాల అభివృద్ధి పట్టించుకోకుండా ఎన్నికలు రావడంతో తాము అభివృద్ధి చేస్తున్నామని జీవోలు చూపించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి వినోద్‌నాయక్, నాయకులు రవినాయక్, సురేష్, రాజు, రవి, శంకర్, వెంకట్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మట్టిని పోయిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం- అన్నారం గ్రామాల మధ్యలో ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. గురువారం సర్పంచ్ మురళి, ఉపసర్పంచ్ శేఖర్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింహారెడ్డి స్పందించి సొంత నిధులతో గుంతలను పూడ్చి వేయించారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పటంతో ఆర్‌అండ్‌బీ డీఈ రవీందర్ రోడ్డును పరిశీలించారు. రోడ్డును బాగు చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మోతిమాత ఆలయంలో నరోత్తం పూజలు



మాతను దర్శించుకుంటున్న నరోత్తం

జహీరాబాద్: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నరోత్తం గురువారం మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలోని మోతిమాత ఆలయాన్ని సందర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జడ్పీటీసీ అరుణ విజయ్‌మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కిషన్‌పవార్, శంకర్‌నాయక్, గోపాల్, రఫియొద్దీన్, వినాయక్‌రెడ్డి, రాములు, జాకీర్ పటేల్, షరీఫ్, సిద్దన్న పాల్గొన్నారు.



కల్హేర్: సిర్గాపూర్‌లో మిలాద్ ఉన్ నబి వేడుకల్లో చిన్నారులు

చిన్నారుల సందడి

మండల కేంద్రంతో పాటు సిర్గాపూర్ మండలాల్లో మిలాద్ ఉన్ నబి వేడుకలను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిర్గాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మతపెద్దలు మిలాద్ ఉన్ నబి విశిష్టతను వివరించారు.

– కల్హేర్(నారాయణఖేడ్)

ముగిసిన ఉత్సవాలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలోని గణేశ్‌గడ్డ దేవాలయ ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

– పటాన్‌చెరు టౌన్



వివిధ రకాల పండ్ల అలంకరణలో గణనాథుడు

గుర్రం జాషువాకు నివాళి

జహీరాబాద్: కవి, రచయిత గుర్రం జాషువా 128 జయంతిని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ సంఘాల నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గుర్రం జాషువా సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అబ్రహాం మాదిగ, ఉల్లాస్ మాదిగ, జైరాజ్, సుకుమార్, రజిని, మోహన్, నర్సింహులు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సంగీత శిక్షణ శిబిరం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం ఫసల్వాది శివారులోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఉచిత సంగీత శిక్షణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో సంగీత రాగాలను నేర్పించారు. అక్టోబర్ 1న 1000 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిమజ్జనం.. ప్రశాంతం

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో గణేషుడి నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. 11 రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడు గురువారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణనాథులను తరలించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సంగారెడ్డి టౌన్ : నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



కల్హేర్: మార్డిలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



కోహీర్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



మునిపల్లి(అందోల్): వినాయక నిమజ్జన ఉత్సవంలో భక్తులు



వట్‌పల్లి(అందోల్): వినాయకుడికి పూజలు చేస్తున్న టీఎస్‌టీపీసీ చైర్మన్ మఠం భిక్షపతి



నారాయణఖేడ్: బాలా భజన మండలి ఆధ్వర్యంలో గణనాథుడి శోభాయాత్ర



పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ కేంద్రంలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సదాశివపేటలో స్వాగతం పలుకుతున్న రాష్ట్ర చేనేత సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

జీఓ 142 రద్దు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్: వైద్య ఆరోగ్య శాఖలో మానవ వనరుల హేతుబద్ధీకరణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ ఎంఎస్ నెంబర్ 142ను రద్దు చేయించాలని కోరుతూ వైద్య ఆరోగ్య శాఖ జేఏసీ నాయకులు ఎమ్మెల్యే మాణిక్‌రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జీఓ ద్వారా సిబ్బందికి అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, జనాభా ప్రాతిపదికన కాకుండా ఇష్టారీతిగా పోస్టులను కేటాయించారన్నారు. జీఓ రద్దు అయ్యేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

జహీరాబాద్: కోహీర్ మండలంలోని మనియార్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సంపత్, రాజ్‌కుమార్, ఖదీర్, ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలి

జహీరాబాద్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ పరిధిలో ఎస్‌ఐజీ ఫేజ్–1లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే మాణిక్‌రావుకు విన్నవించేందుకు ప్రతి ఇంటి నుంచి ఒక్కో సభ్యుడు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పలు సమస్యలను వివరించారు. దీంతో స్పందించిన ఆయన సమస్యలు పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని కాలనీవాసులకు హామీనిచ్చారు.

కల్వర్టు పనులకు శంకుస్థాపన

జహీరాబాద్: కోహీర్ పట్టణంలో అప్రోచ్ రోడ్డుపై అపరిష్కృతంగా ఉన్న కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్టుతో పాటు వరద కాలువల నిర్మాణం పనులను రెండు నెలల్లో పూర్తి చేయిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు యాదవ్, సుభాష్‌రెడ్డి, రామకృష్ణ, కలీం, జావీద్, అన్వాన్ జావేద్, సంపత్‌కుమార్, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులే శ్రేయస్కరం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జహీరాబాద్: రైతులు రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వాడడమే శ్రేయస్కరమని డీడీఎస్–కేవీకే భూసార నిపుణుడు స్వామి అన్నారు. గురువారం ఆ సంస్థ కార్యాలయంలో నాబార్డు వారి సహకారంతో జీవన ఉపాధి–వ్యవస్థాపకత అభివృద్ధి పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి సారవంతాన్ని కోల్పోతుందన్నారు., దీన్ని అధిగమించాలంటే సేంద్రియ ఎరువులే మేలు అని వివరించారు. అనంతరం భూసార పరీక్షల కోసం తీయాల్సిన మట్టి నమూనాలను మహిళా రైతులకు అవగాహన కల్పించారు. విత్తన సంరక్షకురాలు లక్ష్మమ్మ పాత పంటలు అయిన జొన్న, కొర్ర, సామ, రాగులు, సజ్జలు తదితర విత్తనాలను నిల్వచేసుకునే విధానంపై వివరించారు. కార్యక్రమంలో కంగ్టి, ఝరాసంగం మండలాల రైతులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న అనంత కృష్ణ

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తొపాజి అనంత కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్‌తో పాటు పేద ఆర్యవైశ్యులకు వైశ్యబంధు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మ్యాడం రాధా కిషన్, అధ్యక్షుడు పాంపాటి కృష్ణమూర్తి, కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, కోశాధికారి పుల్లూరి ప్రకాష్, నాయకులు నామ భాస్కర్, అమేతి భాస్కర్, చిలమకూరి నరేంద్ర, కటుకం భాస్కర్ పాల్గొన్నారు.

రేపు ఆర్యవైశ్యుల దీక్ష

నారాయణఖేడ్: ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 30న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మాణిక్‌ప్రభు, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు. నారాయణఖేడ్‌లో గురువారం నిర్వహించిన ఆర్యవైశ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గత ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆ సంఘం ఖేడ్ పట్టణ అధ్యక్షుడు వీరేశలింగం, బాధ్యులు రాజు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

తండాల రోడ్లకు రూ.33.70 కోట్లు మంజూరు

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని 30 తండాల రోడ్లకు రూ.33.70 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నారాయణఖేడ్, నిజాంపేట్ మండలాల్లోని కాంజీపూర్‌కు రూ.1.84కోట్లు, మిత్యానాయక్ తండాకు రూ.32లక్షలు, మన్యానాయక్ తండాకు రూ.80లక్షలు, నన్యానాయక్ తండాకు రూ.64లక్షలు, జైరాంతండాకు రూ.56లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. కంగ్టి మండలం భోజాతండాకు రూ.1.20కోట్లు, వాచుతండాకు రూ.1.68కోట్లు, ధర్మానాయక్ తండాకు రూ.80లక్షలు, తుకారాంతండాకు రూ.40లక్షలు, చుక్కల్‌తీర్థ్‌తండాకు రూ.కోటి మంజూరైనట్లు తెలిపారు. నాగల్‌గిద్ద మండలంలోని లక్యానాయక్ తండాకు రూ.1.60కోట్లు, శ్యామ్యానాయక్ తండాకు రూ.1.44కోట్లు, సాదుశంకర్‌నాయక్ తండాకు రూ.1.60కోట్లు, ఇదే తండావద్ద వంతెనకు రూ.1.32కోట్లు, తౌర్యానాయక్ తండా రోడ్డుకు రూ.1.60కోట్లు, పత్తుతండాకు రూ.1.10కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అదేవిధంగా సిర్గాపూర్ మండలంలోని వాలుతండాకు రూ.64లక్షలు, రూప్లాతండాకు రూ.2కోట్లు, గైరాన్‌తండావద్ద వంతెనకు రూ.82లక్షలు, మంగళ్‌తండాకు రోడ్డుకు రూ.64లక్షలు, లంగర్ తండాకు రూ.80లక్షలు, పెద్దశంకరంపేట మండలంలోని తమ్మలకుచ్చ తండాకు రూ.1.53 కోట్లు, మీదితండాకు రూ.80లక్షలు, గట్టుకింది తండాకు రూ.80లక్షలు, ఇస్కపాయ తండాకు రూ.2కోట్లు, ధరావత్‌తండాకు రూ.1.52కోట్లు మంజూరైనట్లు వివరించారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అభివృద్ధి పనుల పరిశీలన**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో చేపట్టిన పైప్‌లైన్ పనులను గురువారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ వేణుపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

◆ **విరాళం అందజేత**

సంగారెడ్డి టౌన్: గణేష్ నవరాత్రుల సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామం ప్రతిష్ఠించిన వినాయక మండపాలకు పట్నం మాణిక్యం ఫౌండేషన్ ద్వారా డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం యువసేన సభ్యులతో కలిసి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

◆ **రూ.2.96లక్షలు పలికిన లడ్డూ**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి లడ్డూ వేలం పాటను నిర్వహించారు. కౌన్సిలర్ సుజాత, ఆమె భర్త మహేందర్‌రెడ్డి రూ.2.96లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

గ్రామంలో..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. బుధవారం రాత్రి పాటి గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద నెలకొల్పిన గణేష్ లడ్డూ వేలం పాట నిర్వహించారు. సర్పంచ్ మున్నూరు లక్ష్మణ్ రూ.11లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్నారు.

రామచంద్రాపురంలో..

పట్టణంలోని మల్లికార్జుననగర్ కాలనీలో రుద్రసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద మూడు లడ్డూలను వేలం వేశారు. మొదటి లడ్డూను తటిబోయిన రిషేంద్ర రూ.2లక్షలు, రెండో లడ్డూను రూ.1,28 లక్షలకు ఏఎం ప్రసాద్, మూడో లడ్డూ రూ.1,50లక్షకు నాగ మల్లేశ్వరరావు దక్కించుకున్నారు.

రూ.7, 80లక్షలు పలికిన గణేష్ గడ్డ లడ్డూలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం సమీపంలోని గణేష్ గడ్డ దేవాలయంలో గురువారం మూడు లడ్డూలకు వేలం పాట నిర్వహించారు. పోటాపోటీగా సాగిన ఈ వేలంలో మొదటి లడ్డూను సంగారెడ్డికి చెందిన మహేష్ రూ.3, 80లక్షలు, రెండో లడ్డూను శంకర్‌పల్లికి చెందిన సాయిదీప్‌రెడ్డి రూ.2,80లక్షలు, మూడో లడ్డూను నర్సాపూర్ తునికికి చెందిన నారాయణరెడ్డి రూ. 1,70లక్షలకు దక్కించుకున్నారు. మూడు లడ్డూలు కలిసి రూ.7,80లక్షలకు పలికాయి.

◆ **వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు**

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని ప్రసిద్ధి చెందిన గణపతి దేవాలయంలో వినాయకచవితిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు.

◆ **నియామకం**

నారాయణఖేడ్: అంబేడ్కర్ ఫూలే సేవా సమితి గ్రేటర్ హైదరాబాద్‌శాఖ అధ్యక్షుడిగా షేక్ తయ్యబ్ నియమితులయ్యారు. ఖేడ్‌లోని ఆ సంఘం కార్యాలయంలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం, ప్రధాన కార్యదర్శి పండరి, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొని షేక్‌తయ్యబ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు.

◆ **మాజీ ఎంపీటీసీకి నివాళి**

జహీరాబాద్: మాజీ ఎంపీటీసీ దివంగత ప్రతాప్‌రెడ్డికి ఆయా పార్టీల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం మండలంలోని పస్తాపూర్ గ్రామంలోని ఎస్పీ ఫంక్షన్‌హాల్‌లో ప్రతాప్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ మంత్రి చంద్రశేఖర్, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ కో ఆర్డినేటర్ గిరిధర్‌రెడ్డి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న యువకులు



చింతా ప్రభాకర్‌ను సన్మానిస్తున్న మతపెద్దలు

పటాన్‌చెరు టౌన్: మహమ్మద్ ప్రవక్త జయంతి (మిలాద్ ఉన్ నబీ) సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు ఎండి మేరాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమేర్, సోహైల్, ఒమర్, ఇబ్రహీం, షకీల్, వసీం, జలీల్, ముజీబ్, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్‌లో..

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి మండలంలోని కులబ్గూర్ గ్రామంలో టీజేఆర్ కాలనీలో గురువారం మిలాదున్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్ ప్రత్యేక ప్రార్థనలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణంలో దారుసలం పెద్ద మసీద్ వద్ద ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో బీఆర్‌ఎస్ నేత చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిరవి, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రవి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కార్యదర్శి పెరమళ్ల నర్సింహులు, కంది జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షేక్ అంజద్ తదితరులు పాల్గొన్నారు.